సాక్షి
ఏలూరు
గురువారం । 2 । నవంబర్ । 2023





## నిషేధిత సిగరెట్ల పట్టివేత

ఏలూరు జాతీయ రహదారిపై వట్లూరు పరిధిలో లారీని పట్టుకుని పోలీసులు రూ.99 లక్షల విలువైన నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. 10లో ▸



## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం గాంధీ బొమ్మ సెంటర్‌లో హత్య ఘటనలో నిందితుడిని అరెస్టు చేశారు. పందెం కోళ్లకు కట్టే కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. 10లో ▸

## ఎస్సైకు సేవా పతకం



సాక్షి, భీమవరం: ఇంటెలిజెన్స్ ఎస్సైగా సేవలందిస్తున్న చీకట్ల రమేష్ బాబు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెల్లం నాగేశ్వర రావు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పతకాలకు ఎంపికయ్యారు.

## న్యూస్‌రీల్

### పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషిచేయాలి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తోన్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను తెలుగుజాతి మరువదని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. జెండా వందనం చేసిన అనంతరం అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించేలా ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, పోలీస్ ప్రధాన కార్యాలయ ఏవో బీవీఎస్ఆర్‌కే నాయక్, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షకులుగా జెడ్పీ సీఈవో

ఏలూరు(మెట్రో): గ్రామ,వార్డు సచివాలయాల పర్యవేక్షణకు జెడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్.సుబ్బారావును నోడల్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ విధులు నిర్వర్తించిన ఏలూరు డీఎల్‌డీవో జి.రమణ బదిలీ కారణంగా జెడ్పీ సీఈవోను నియమించారు.

### కామవరపుకోట మండలంలో జగనన్నకు చెబుదాం

ఏలూరు(మెట్రో): ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జేకేసి గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా కామవరపుకోట మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 3న శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శ్రీ చిన రాజప్ప ఆర్య వైశ్య కళ్యాణ మండపం, కొత్తూరు చెక్ పోస్టు రోడ్, కామవరపుకోటలో ఈనెల 3న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.

### ముగిసిన ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: బుధవారం ఏలూరులో సీసీ క్లబ్ ఆవరణలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ కరాటే జట్టు ఎంపిక పోటీలు జరిగాయని ట్రెడిషనల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు డీఎల్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ పోటీలను కరాటే శిక్షకులు ఇబ్రహీం బేగ్, కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ పరిశీలించారని వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని వివరించారు. వీరిలో నందిని, ధనుష్, యశస్విని, అనిల్, మోహత్, భూపతి, ప్రతీమ్, సూర్యఅవినాష్, తారక్, అవినాష్, ఏ శ్రీనివాస్ ఉన్నారని తెలిపారు.

### సర్పంచుల గౌరవ వేతనం విడుదల

ఏలూరు(మెట్రో): ప్రభుత్వం గ్రామ సర్పంచుల గౌరవ వేతనం రూ 1,46,88,000 ఏలూరు జిల్లాకు విడుదల చేసినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 544 గ్రామ పంచాయతీలకు నెలకు రూ. 3000 చొప్పున 9 నెలల గౌరవ వేతనం మూడు క్వార్టర్‌లలో విడుదల చేసిందన్నారు. ఒకటి, రెండు రోజులలో గ్రామ పంచాయతీ ఖాతాలకు జమచేశామన్నారు.

### 8న తిరుపతిలో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 8 నుంచి 10 వరకూ తిరుపతి వెంకటేశ్వర యూనివర్శిటీలో 42వ మాస్టర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బీడీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ భవనం వద్ద జట్టు ఎంపిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. 30 ఏళ్ళు నిండిన మహిళలు, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. మరింత సమాచారం కోసం 98852 74122 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

# మహిళల భద్రతకు భరోసా

- గంజాయి మాఫియాపై యుద్ధం
- పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత
- 'సాక్షి'తో ఎస్పీ మేరీ ప్రశాంతి




సమాజంలో ప్రజలంతా అభద్రతాభావం లేకుండా సంతోషంగా జీవించేందుకు రాజ్యాంగం హక్కులు కల్పించిందని.. అందుకోసం పోలీసు యంత్రాగం కట్టుబడి ఉందని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని 'సాక్షి'తో మాట్లాడారు.

ఏలూరు టౌన్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు, మహిళలపై దాడులకు పాల్పడేవారికి సత్వర శిక్షలు పడేలా చేపడుతున్న చర్యల గురించి ఎస్పీ మేరీ ప్రశాంతి వివరించారు. వివరాలు ఎస్పీ మాటల్లోనే..

**దాడులకు పాల్పడాలంటే భయపడేలా..**

మహిళలపై అఘాయిత్యాలు, దాడులకు పాల్పడాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధితులకు న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నాం. ఏలూరులో యాసిడ్ దాడి కేసులో కేవలం 48 గంటల్లోనే నిందితులను అరెస్టు చేశాం. 21 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేశాం. పోలీస్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేశారు. బాధిత మహిళ ఎడ్ల ప్రాన్సిక మృతిచెందటం బాధించింది. దెందులూరు శ్రీరామవరంలోనూ బాలికపై అఘాయిత్యం చేసిన వ్యక్తి అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశాం.

**117 రోజుల్లోనే నిందితులకు శిక్ష**

ప్రజల్లో పోలీసు, న్యాయవ్యవస్థలపై నమ్మకం మరింత పెరిగేలా యాసిడ్ దాడి కేసులో నిందితులకు న్యాయస్థానంలో శిక్షలు పడేలా కృషి చేశాం. 117 రోజుల్లోనే ముగ్గురు నిందితులకు శిక్షలు విధించటం, జైలు ఊచలు లెక్కించటం చరిత్రలో నిలిచిపోతుంది. ఒక్కో నిందితుడికి మూడు యావజ్జీవ ఖైదులు శిక్షగా విధించారు. హత్య, యాసిడ్ దాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఈ మూడింటిలోనూ మూడు జీవిత ఖైదులు విధించారు. ఇలాంటి తీర్పులు సమాజంలో నేరాలకు పాల్పడే వారికి ఒక హెచ్చరిక. పోలీస్, న్యాయ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా చేసింది.

**దిశ టీంలు ఏర్పాటు**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళా రక్షణకు దిశ పోలీస్ స్టేషన్లు, దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా ఏలూరు నగరంలో దిశ టీమ్స్ ఏర్పాటు చేస్తున్నాం. దిశ మహిళా పోలీస్ సిబ్బంది స్కూళ్లు, కాలేజీల వద్ద నిఘా వేస్తారు. విద్యార్థినిల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా చర్యలు తప్పవు. విద్యార్థులకైతే కౌన్సిలింగ్, బయట వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయి.

**కూకటివేళ్లతో పెకిలించేలా**

గంజాయిపై యుద్ధం ప్రకటించాం. డిమాండ్ ఉంటేనే సప్లయి ఉంటుందనే ప్రాథమిక అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటూ.. గంజాయి వినియోగించిన వ్యక్తి నుంచి.. ఎవరు విక్రయించారు, ఎవరు రవాణా చేస్తున్నారనే మూలాల్లోకి వెళ్తున్నాం. గంజాయి మాఫియాను కూకటివేళ్లతో పెకిలించేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ఎస్ఈబీ ప్రత్యేకంగా దృష్టి సారించి దాడులు చేస్తోంది. గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలుగా మారినవారిని డీ-ఎడిక్షన్ సెంటర్లకు పంపుతున్నాం.

**అవినీతి, అక్రమాల్ని సహించం**

ప్రజలే కాదు పోలీస్ శాఖలోని అధికారులు, సిబ్బంది ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. ఏదైనా ఆరోపణలు వస్తే ముందుగా శాఖాపరమైన విచారణ చేపట్టి నిజమని రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీస్‌స్టేషన్లకు వచ్చే మహిళలు, బాధితుల పట్ల సిబ్బంది మర్యాదగా నడుచుకోవాల్సిన అవసరం ఉంది. విధుల్లో అలసత్వాన్ని సమర్థించే అవకాశం ఏమాత్రం ఉండదు.

**సిబ్బంది సంక్షేమానికి కృషి**

నూజివీడు సబ్ డివిజన్ ఆగిరిపల్లిలో గణేష్ నిమజ్జనంలో దుండగుడి దాడిలో తీవ్ర గాయాలై మృత్యువుతో పోరాడి మరణించిన గంధం నరేంద్ర కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుంది. నిబద్ధత కలిగిన సిబ్బందిని కోల్పోవడం బాధించింది. పోలీస్ సిబ్బందికి ఎలాంటి కష్టం వచ్చినా అంతా అండగా ఉంటూ భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నాం. పోలీస్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా తీసుకుంటూ మరింత సమర్థంగా పనిచేస్తాం

## పోలీసు సేవలకు ఉత్తమ పతకాలు

**అభినందించిన అధికారులు**

ఏలూరు టౌన్: రాష్ట్రంలోని పోలీసు, అవినీతి నిరోధక శాఖ, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్నిమాపక శాఖలలో పనిచేస్తూ ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమసేవా పతకాలను ప్రకటించింది. ఏలూరు జిల్లాకు చెందిన ఆయా శాఖల్లోని అధికారులు అవార్డులకు ఎంపికయ్యారు. ఏలూరు జిల్లా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ రత్నబాబుకు ఉత్తమ సేవా పతకాన్ని రాష్ట్ర సర్కారు ప్రకటించింది. జిల్లా ఏసీబీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎన్.విజయభాస్కరరావుకు రాష్ట్ర పోలీసు ఉత్తమ సేవా పతకం, ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తోన్న ఎస్సై చీకట్ల రమేష్‌బాబుకు రాష్ట్ర పోలీస్ సేవాపతకం, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో ఎఆర్ ఎస్ఐగా పనిచేస్తోన్న జి.శ్రీనుకొండలరావుకు రాష్ట్ర పోలీస్ సేవాపతకం, పెదపాడు పోలీస్ స్టేషన్ మహిళా ఏఎస్ఐ పైడి లక్ష్మీ వేదకుమారికి రాష్ట్ర పోలీస్ సేవా పతకం, తడికలపూడి హెడ్‌కానిస్టేబుల్ నాయుడు రాజేంద్ర ప్రసాద్‌కు రాష్ట్ర పోలీస్ సేవా పతకం, నూజివీడు ఫైర్‌స్టేషన్‌లో పనిచేస్తున్న లీడింగ్ ఫైర్‌మెన్ డీ మత్తయ్యకు రాష్ట్రపోలీస్ సేవా పతకం, జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పులపర్తి శివరామకృష్ణకు రాష్ట్ర పోలీస్ సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

# జెడ్పీ పనులు సకాలంలో పూర్తి చేయాలి

**పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు**




తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: జెడ్పీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులన్నీ తక్షణమే మొదలుపెట్టి నిర్ణీతసమయంలో పూర్తిచేసేలా అధికార యంత్రాంగం కృషిచేయాలని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తణుకు నియోజకవర్గ జిల్లా పరిషత్ అధికారులు, పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోను స్థానిక ప్రజల సౌకర్యార్థం ఏ పని ముందుగా చేపట్టాల్సి ఉందో తెలుసుకుని దానికి ప్రాధాన్యతనిస్తూ సదరు పని పూర్తిచేయాలని కోరారు. గతంలోనే పిలిచిన వర్కుల్లో కొన్ని మార్పులు చేసి తిరిగి జిల్లా పరిషత్ నిధులు రూ. 5.10 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఏ ప్రాంతంలో ఏ పనిచేయాల్సి ఉందో స్థానిక నాయకులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ విభాగంలో చేపట్టాల్సిన పనుల్లో ముందుగా అధిక ప్రాధాన్యత కలిగిఉన్న వాటిని పూర్తిచేస్తామని, పూర్తయిన వెంటనే సదరు బిల్లులు వెంటనే వచ్చేలా కృషిచేస్తామని చెప్పారు. తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు చెందిన పార్టీ నాయకులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారానికి కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటా ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, తణుకు, అత్తిలి ఏఎంసీ చైర్మన్‌లు నత్త కృష్ణవేణి, బుద్దరాతి భరణిప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, తణుకు, అత్తిలి మండలాల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ దత్తత మాసోత్సవంపై అవగాహన



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారి కె.పద్మావతి

ఏలూరు (టూటౌన్): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ దత్తత మాసోత్సవం ప్రారంభ కార్యక్రమాలు స్థానిక శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రతి ఏడాది నవంబర్ నెలను దత్తత మాసోత్సవంగా నిర్ణయించిందన్నారు. ఏ ఒక్క చిన్నారులు అనాథలుగా ఉండకుండా వారికి మంచి జీవితం అందించాలనే కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షలకు అనుగుణంగా ఈ నెలంతా దత్తత స్వీకరణ కార్యక్రమంపై ప్రచారం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దత్తత ప్రక్రియ పూర్తి కావడానికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ కేర్ హోం, ఆరోగ్య శాఖ, పోలీస్, స్వచ్ఛంధ సంస్థలు, పౌర సంబంధాల శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రాజేశ్వరరావు మాట్లాడుతూ చిల్డ్రన్ హోంలో ఉన్న అనాథల పిల్లలను వారి వ్యక్తిగత రిపోర్టులను పరిశీలించి వారికి లీగల్లీ ఫ్రీ ఫర్ అడాప్షన్ ఆర్డర్ ఇచ్చి వారిని దత్తత ఇచ్చి మంచి కుటుంబ వాతావరణంలో పెరిగేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర హోం సూపరింటెండెంట్ మురళీధరన్, డీపీఓ దుర్గాప్రసాద్, సైకాలజీ కౌన్సిలర్స్ వీర్రాజు, బిందు, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆర్.రాజేష్, సీహెచ్ శ్రీకాంత్, బాలాస్వామి, ఓ.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

### లేఅవుట్లను వెబ్‌సైట్‌లో ఉంచాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఆమోదం పొందిన లేఅవుట్లను ప్రజల పరిశీలన నిమిత్తం జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచుతామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, డీపీఓ, జిల్లాలోని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమై లేఅవుట్లపై సమీక్షించారు. అక్రమ లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అనుమతి పొందిన లేఅవుట్లను గ్రామాల వారీగా ప్రజలు పరిశీలించుకునేందుకు అనువుగా జిలా వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు. అర్బన్ టౌన్ ప్లాన్ లాగా గ్రామాల్లో ప్లాన్ లేదని, సమిత్వ గ్రామ కంఠం సంబంధించి సర్వేలో విలేజ్ ప్లాన్‌లో డ్రెయిన్లు, రోడ్లు అప్రూవ్ చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీ చంద్రశేఖర్, ప్లానింగ్ ఆఫీసర్ సురేఖ, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, భీమవరం టౌన్ ప్లానింగ్ అధికారి గౌర్ పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

ఏలూరు(మెట్రో): అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. గౌతమీ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఎస్.ఎస్.కె. ఖాజావలి, బీసీ సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత, ఎస్సీ కార్పొరేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుముదిని సింగ్ తదితరులు ఉన్నారు. కలెక్టర్ మాట్లాడుతు భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకోసం అహర్నిశలు కృషిచేసి రాష్ట్ర ఆవిర్భావానికి శ్రీకారం చుట్టిన పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరమన్నారు.

**పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడు**

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఏలూరు జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో కార్యాలయం సిబ్బంది అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ శ్రీ పొట్టిశ్రీరాములు వంటి మహనీయుల త్యాగఫలితమే భాష ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని, వారి త్యాగాన్ని స్మరించుకోవడం గొప్ప విషయంగా భావించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రిసోర్స్ కేంద్రం సమన్వయకర్త ఓ.శిరీష, పరిపాలన అధికారి ఎం.వి.కిషోర్, సీనియర్ సహాయకులు వై.సురేష్, డీపీఎం సత్య పులి, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో భారీ వర్షం



ఏలూరు నగరంలో మేఘావృతమైన ఆకాశం

అకాల వర్షం బుధవారం రాత్రి ఏలూరును ముంచెత్తింది. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం మబ్బులతో నిండిపోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా గాలి వీచి వరుణుడు నగరాన్ని పలుకరించాడు. చినుకుచినుకుగా మొదలైన వాన క్షణాల్లోనే కుండపోత వర్షంగా మారడంతో నగర ప్రజలు ఇబ్బంది పడ్డారు. దాదాపు 45 నిమిషాల పాటు కురిసిన వాన కారణంగా రామచంద్రరావు పేట, పవర్ పేట రైల్వేస్టేషన్ రోడ్డు, గన్ బజారు ప్రాంతాలు నీటమునిగాయి. – ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)





జలమయమైన నగర రహదారులు

# విస్తృతంగా ఆర్టీసీ కార్గో సేవలు



కార్గో సేవలపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ఆర్టీసీ కార్గో సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఆర్టీసీ కార్గో మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద నుంచి ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా వర ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయ వనరులు పెంచుకునేందుకు కార్గో సేవలను కూడా ప్రారంభించిందని, ఈ సేవలు ప్రస్తుతం వినియోగదారుల ఆదరణతో ఇతర కార్గో సర్వీసులను మించి సేవలందిస్తోందన్నారు. ప్రజా రవాణా శాఖ కేంద్ర కార్యాలయ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 26 నుంచి ఈ నెల 25 వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి, తదితరులు పాల్గొన్నారు.

# 18 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వీవై ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 18 నుంచి 30 వరకూ 12 రాత్రులు, 13 పగలు యాత్ర ఉండేలా సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర విత్ స్టాట్యూ ఆఫ్ యూనిటీ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర విజయవాడ స్టేషన్ నుంచి ఈ నెల 18న ప్రారంభమై ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. యాత్రలో భాగంగా ఉజ్జయిని, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ద్వారకా, సోమనాథ్, పూణే, నాసిక్, ఔరంగాబాద్‌లోని సప్త జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. స్లీపర్ క్లాస్ టిక్కెట్ ధర రూ.21 వేలు, థర్డ్ ఏసీ రూ.32,500, సెకంట్ ఏసీ రూ.42,500గా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసి సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. సహాయం కొరకు 92814 95848, 97013 60675 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## క్లుప్తంగా

### జూడో జాతీయ పోటీలకు గొల్లపల్లి విద్యార్థిని ఎంపిక

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థిని శ్రావణి జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం దుర్గామల్లేశ్వరి చెప్పారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జూడో పోటీల్లో శ్రావణి ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించిందన్నారు. దీంతో జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని శ్రావణిని బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అలాగే హిందీ ఉపాధ్యాయిని మల్లేశ్వరి క్రీడాకారిణికి నగదును అందించారు. పీడీ పీ రవీంద్ర, ఉపాధ్యాయులు మోహన్‌రావు అభినందించారు.

### కత్తితో బెదిరించి పందెంకోళ్ల అపహరణ

నూజివీడు: కత్తితో బెదిరించి పందెం కోడిపుంజులను ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని పాత రావిచర్లలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మెతుకుమిల్లి శ్రీనివాసరావు గత కొన్నేళ్లుగా పందెం కోడిపుంజులను పెంచుతున్నాడు. వీటిని సంక్రాంతి సమయంలో విక్రయించి సొమ్ము చేసుకుంటాడు. అయితే అర్ధరాత్రి 1 గంట సమయంలో నలుగురు వ్యక్తులు వ్యాన్‌లో వచ్చి శ్రీనివాసరావుతో పాటు అతని భార్య పద్మావతిలను కత్తితో చంపేస్తామంటూ బెదిరించి 10 కోడిపుంజులను ఎత్తుకెళ్లారు. కోడి పుంజుల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుంది. బాధితుడు బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నిషేధిత సిగరెట్ల పట్టివేత

- లారీని అడ్డుకున్న విజిలెన్స్ అధికారులు
- రూ.99 లక్షల విలువైన సిగరెట్ల స్వాధీనం



అక్రమంగా సిగరెట్లు తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు

ఏలూరు టౌన్: నిషేధిత సిగరెట్లు రవాణా చేస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు అడ్డుకుని రూ.99 లక్షల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారం మేరకు ఏలూరు జాతీయ రహదారిపై వట్లూరు పరిధిలో రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వాహన తనిఖీలు చేపట్టిన అధికారులు భారీఎత్తున అక్రమంగా సిగరెట్లు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్, పోలీస్, రెవెన్యూ, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టి బీఆర్01 జీఎల్ 5036 నంబర్ వాహనాన్ని తనిఖీ చేయగా నిషేధిత సిగరెట్లు రవాణా చేస్తున్న వాహనాన్ని గుర్తించారు. బీహార్ రాష్ట్రం పాట్నా ప్రాంతం నుంచీ ఏపీ రాష్ట్రంలోని గుంటూరుకు రూ.99 లక్షల విలువైన సిగరెట్లు రవాణా చేస్తున్నట్లు నిర్ధారించారు. వాహనంలో సుమారుగా 49వేల 500 సిగరెట్ల పెట్టెలు ఉన్నట్లు, వాటిని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సిగరెట్లతోపాటు వాహనాన్ని సీజ్ చేసి ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏజీ పీ.శ్రీధర్, విజిలెన్స్ ఎస్‌ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, త్రీటౌన్ ఎస్‌ఐ మణికుమార్, జీఎస్టీ అధికారులు టీ.విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ జగదీశ్వరయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి ప్రశాంత్‌కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ పి.రాజేష్

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డు గాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగిన హత్య ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గత నెల 30వ తేదీ రాత్రి సమయంలో గోసుల ఏడుకొండలు అలియాస్ బాలాజీ అనే వ్యక్తిని అదే ప్రాంతానికి చెందిన ఇళ్ల శ్రీనివాస్ అనే యువకుడు పందెం కోళ్లకు కట్టే కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. శ్రీనివాస్‌ను తరచూ బాలాజీ అవమానాలు చేస్తూ వేధిస్తున్నాడని, అలాగే తనపై హేళనగా మాట్లాడటమే కాక ఇతరుల వద్ద తక్కువ చేస్తూ మాట్లాడుతున్నాడని శ్రీనివాస్ కక్ష పెంచుకున్నట్లు సీఐ తెలిపారు. అయితే విషయాన్ని తెలుసుకున్న బంధువులకు సంబంధించిన వ్యక్తులు, స్నేహితులు 30వ తేదీన రాజీ చేసేందుకు ఇద్దరితో మాట్లాడేందుకు పిలిపించగా, బాలాజీ శ్రీనివాస్‌పై దాడి చేసి పీక నొక్కే ప్రయత్నంలో, తాను వెంట తీసుకువచ్చిన కత్తితో బాలాజీపై దాడి చేసి గాయపర్చాడన్నారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతని దుస్తులు, దాడి చేసిన కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడి అరెస్టులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందికి రివార్డు కోసం ఎస్పీకి సిఫారసు చేయనున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

## ● గడపగడపకు సంక్షేమం



టి.నరసాపురం : తిరుమలదేవిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

### ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విచారణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని పరీక్ష రాయకుండా ఆపడం, అనంతర పరిణామాలపై బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందడంతో బుధవారం కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ పాఠశాలలో విచారణ నిర్వహించారు. పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, విద్యార్థి తల్లిదండ్రులను విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 9వ తరగతి విద్యార్థి ఫీజు కట్టలేదని పరీక్షకు హాజరు కానివ్వకపోవడం, ఆలస్యంగా పరీక్ష రాయించడంతో విద్యార్థి మనస్తాపానికి గురై ఇంట్లో చెప్పకుండా విద్యార్థి అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రులు కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ సందర్భంగా రాజేంద్రప్రసాద్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఎంఈవో రాముడు, ఐసీడీఎస్ సీడీపీవో బ్యూల పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు

నరసాపురం రూరల్: కారు అద్దెకు తీసుకుని తిరిగి ఇవ్వని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్సై గుర్రయ్య చెప్పారు. చిట్టవరానికి చెందిన కాటూరి శ్యామ్ తన కారును అమలాపురానికి చెందిన బీరా కృష్ణంరాజుకు అద్దె ప్రాతిపదికన ఇచ్చాడు. అద్దె చెల్లించకపోగా, కారు ఇవ్వడం లేదంటూ శ్యామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### జిల్లా దాటి పింఛను సొమ్ము అందించి..



మండవల్లి : కానుకొల్లు గ్రామానికి చెందిన చెరుకూరి నాగరత్నమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలో కుటుంబ సభ్యుల వద్ద ఉంది. దీంతో నాగరత్నమ్మ అవసరాలను గుర్తించిన కానుకొల్లు వలంటీర్ రాయగిరి యామిని విజయవాడ వెళ్లి బుధవారం వృద్ధాప్య పింఛనును అందజేసింది. దీంతో కుటుంబ సభ్యులు వలంటీర్ యామినిని అభినందించారు.

### పాము కాటుకు మహిళా కూలీ మృతి

పెదవేగి: పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురై ఓ మహిళా కూలీ మృతి చెందింది. ఎస్సై ఎం.లక్ష్మణ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేగివాడకు చెందిన కాత్రు లక్ష్మణరావు, మార్తమ్మ (35) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. మార్తమ్మ బుధవారం అదే గ్రామానికి చెందిన జిజ్జరి వెంకటేశ్వరరావు అనే రైతు పొలంలో పనికి వెళ్లింది. ఆయిల్‌పామ్ తోటలో పనిచేస్తుండగా ఉదయం తొమ్మిది గంటల సమయంలో పాము కాటు వేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను ద్విచక్ర వాహనంపై ఏలూరు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఉన్న గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి ద్విచక్రవాహనంపై ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మార్తమ్మ మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



## గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.